సాక్షి
కాకినాడ
శనివారం । 11 । మార్చి । 2023



రూ.లక్ష విరాళం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో శాశ్వత నిత్య సుదర్శన హోమానికి కిళాంబి రాఘవాచారి, లక్ష్మి దంపతులు (న్యూఢిల్లీ) శుక్రవారం రూ.లక్ష విరాళం సమర్పించారు.



అన్నదమ్ములే నిందితులు

గత నెల 24న రాయవరం మండలం మాచవరం గ్రామ సమీపంలోని పంట పొలాల్లో జరిగిన హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. - IIలో▸

తండ్రీకొడుకుల దుర్మరణం



సామర్లకోట ప్లై ఓవర్ బ్రిడ్జి కూడలిలో శుక్రవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తండ్రీ కొడుకులు దుర్మరణం పాలయ్యారు. ఈ సంఘటనపై ఆగ్రహం చెందిన కుటుంబ సభ్యులు, బంధువులు, ఎఫ్‌సీఐ జట్టు కూలీలు ఆందోళన నిర్వహించారు. - IIలో▸

న్యూస్‌రీల్

శ్రీవాణి పథకంలో 136 ఆలయాల నిర్మాణం



దేవదాయ శాఖ జిల్లా అధికారి నారాయణమూర్తి

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): టీటీడీ శ్రీవాణి పథకం కింద జిల్లాలో 136 ఆలయాలను అభివృద్ధి చేయనున్నారు. ఈ మేరకు ఒక్కో ఆలయానికి రూ.10 లక్షల చొప్పున మంజూరయ్యాయని దేవదాయ శాఖ జిల్లా అధికారి పులి నారాయణమూర్తి తెలిపారు. కాకినాడలోని జిల్లా దేవదాయ శాఖ కార్యాలయంలో ఆయన శుక్రవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. హిందూ ధర్మ పరిరక్షణలో భాగంగా జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ ప్రాంతాల్లో కొత్తగా ఆలయాల నిర్మాణం చేపట్టనున్నారని తెలిపారు. గొల్లప్రోలు మండలానికి 5, జగ్గంపేట 1, కాకినాడ రూరల్ 36, కాకినాడ అర్బన్ 2, కరప 45, కాజులూరు 38, కోటనందూరు 1, పెదపూడి 2, పెద్దాపురం 3, పిఠాపురం 1, సామర్లకోట 1, తాళ్లరేవు 3, తుని 2, యు.కొత్తపల్లి మండలానికి ఒకటి చొప్పున ఆలయాల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని వివరించారు. వీటి నిర్మాణం త్వరలోనే ప్రారంభిస్తామని నారాయణమూర్తి తెలిపారు.

13న జాబ్‌మేళా

కాకినాడ సిటీ: వికాస కార్యాలయంలో ఈ నెల 13న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు శుక్రవారం తెలిపారు. డ్రీమ్ వే సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్‌లో ఫ్రంట్ ఆఫీస్, వెబ్ డెవలపర్, మొబైల్ యాప్ డెవలపర్, డిజైనర్ అండ్ యానిమేటర్ పోస్టులకు; నిట్ (ఐసీఐసీఐ) బ్యాంక్‌లో రిలేషన్‌షిప్ మేనేజర్, సీనియర్ ఆఫీసర్; డెక్కన్ కెమికల్స్‌లో ట్రైనీ; ఇండిగో ఎయిర్‌లైన్స్‌లో లోడర్లు, డ్రైవర్లు; వీల్స్‌మార్ట్ ఆటో ఫైనాన్స్‌లో సేల్స్ ఎగ్జిక్యూటివ్, టెలికాలర్, మెకానిక్ హెల్పర్; గవర్నమెంట్ ప్రాజెక్టులో కాలింగ్ ఏజెంట్లు; ఐనాక్స్‌లో ఆపరేషన్ అసోసియేట్లు; అమె జాన్‌లో ఎస్ఎస్‌ఏ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారని వివరించారు. అలాగే డీడీయూజీకేవై స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ద్వారా శిక్షణ ఇచ్చి ఉద్యోగం కల్పించనున్నారన్నారు. ఈ ఉద్యోగాలకు పదో తరగతి నుంచి పీజీ వరకూ చదివిన 35 ఏళ్ల లోపు వారు అర్హులన్నారు. వీరికి ఆయా ఉద్యోగాలను బట్టి నెలకు రూ.10 వేల నుంచి రూ.35 వేల వరకూ జీతం, ఇన్సెంటివ్‌లు, భోజనం, వసతి, రవాణా సౌకర్యాలు ఉంటాయని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు సోమవారం ఉదయం 9 గంటలకు కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయానికి సర్టిఫికెట్ల జిరాక్సులతో హాజరు కావాలని లచ్చారావు వివరించారు.

భవన నిర్మాణ కార్మికుడి మృతి

కాకినాడ క్రైం: ప్రమాదవశాత్తూ ఓ భవన నిర్మాణ కార్మికుడు ప్రాణాలు కోల్పోయాడు. కాకినాడ రూరల్ మండలం కొవ్వాడకు చెందిన కోటిపల్లి నాగరాజు (34) భవన నిర్మాణ కార్మికుడిగా జీవిస్తున్నారు. శుక్రవారం ఉదయం ఎల్విన్‌పేట సమీపంలోని ఓ ఐదంతస్తుల భవనంలో పనికి వెళ్లాడు. నాలుగో అంతస్తులో ఉన్న నాగరాజు భారీ నిర్మాణ సామగ్రిని కింది నుంచి పై అంతస్తులకు తరలించే వించ్ మెషీన్ ద్వారా వచ్చిన గుమ్మాలు అందుకోబోయాడు. ఈ క్రమంలో కాలు జారి కిందకి పడిపోయి, అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై మేస్త్రి వెంకట రమణ ఫిర్యాదుతో కాకినాడ టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య, ఐదేళ్ల కుమారుడు ఉన్నారు.

ఆటో బోల్తా పడి డ్రైవర్..

కాకినాడ క్రైం: ఆటో బోల్తా పడి డ్రైవర్ మృతి చెందిన ఘటన కాకినాడలో చోటు చేసుకుంది. నగరానికి చెందిన ఇసరాపు రమణ (57) గురువారం రాత్రి డి-మార్టు నుంచి బస్టాండ్‌కు వస్తున్నాడు. కోకిలా సెంటర్‌లో అతి వేగంగా వచ్చిన ఓ బైక్‌ను తప్పించబోయి సడన్ బ్రేక్ వేశాడు. ఈ క్రమంలో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో రమణకు గుండె కింది భాగంలో తీవ్ర గాయమైంది. కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా, చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

నాణ్యమైన విద్యుత్ అందించాలి

రాజమహేంద్రవరం సిటీ: వేసవిలో వినియోగదారులకు జవాబుదారీగా ఉంటూ నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని సంబంధిత అధికారులను ఏపీ ఈపీడీసీఎల్ సీఎండీ కె.సంతోష రావు ఆదేశించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని అన్ని డివిజన్ల అధికారులతో రాజమహేంద్రవరం సర్కిల్ కార్యాలయంలో ఆయన శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వేసవిలో విద్యుత్ సమస్యలు ఉత్పన్నం కాకుండా ఉండేందుకు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేపట్టాలన్నారు. విద్యుత్ చౌర్యం, లైన్ల నవీకరణ, ట్రాన్స్‌ఫార్మర్ల పనితీరు తదితర అంశాలపై సమీక్షించారు. ఈపీడీసీఎల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ ప్రతాప్‌కుమార్ మాట్లాడుతూ, జగనన్న కాలనీల్లో విద్యుత్ సౌకర్యం కల్పనకు పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు పనులు చేపట్టాలని అన్నారు.



తలుపులమ్మ తల్లి ఆలయాన్ని పునర్నిర్మించనున్న పవిత్ర స్థలం



నూతన ఆలయ నిర్మాణానికి తీసుకువచ్చిన కృష్ణశిలలు

అమ్మవారికి.. అందాల మందిరం

- తలుపులమ్మ తల్లికి కృష్ణశిలతో ఆలయం
- చెక్కుచెదరని రీతిలో పునర్నిర్మాణం
- చకచకా ఏర్పాట్లు.. 3 నెలల్లోగా పూర్తి

తుని రూరల్: భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి.. తలుపులమ్మ తల్లికి అందాల మందిరం రూపుదిద్దుకోనుంది. ఇందుకు సంబంధించిన చకచకా ఏర్పాట్లు జరుగుతున్నాయి. లోవ దేవస్థానంలో స్వయంభువుగా వెలసిన అమ్మవారి దర్శనానికి ఏటా లక్షలాది మంది వస్తుంటారు. పర్వదినాల్లో అయితే లోవ ప్రాంగణం, రహదారి కిక్కిరిసిపోతూంటాయి. ప్రస్తుతం అమ్మవారి గర్భాలయం గుహలో ఆరడుగుల ద్వారంతో ఉంది. ఈ ద్వారం చిన్నదిగా ఉండటంతో వస్తున్న భక్తుల్లో 40 నుంచి 50 శాతం మంది మాత్రమే అమ్మవారిని దర్శించుకోగలుగుతున్నారు. దీనిని గుర్తించిన అధికారులు ఆలయాన్ని సువిశాలమైన ద్వారంతో పునర్నిర్మించేందుకు ప్రణాళిక రూపొందించారు. అమ్మవారి విగ్రహం చెక్కు చెదరకుండా.. భక్తులు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా దర్శించేందుకు వీలుగా ద్వారాన్ని విస్తరిస్తారు. ఈ పనులు పూర్తయితే నూరు శాతం భక్తులు అమ్మవారిని కన్నులారా దర్శించుకునే అవకాశం కలగనుంది.



పునర్నిర్మించనున్న ఆలయం నమూనా

చురుకుగా..

ప్రస్తుతం ఆలయ పునర్నిర్మాణ పనులు చురుకుగా జరుగుతున్నాయి. దశాబ్దాల పాటు చెక్కు చెదరని రీతిలో నూతన ఆలయాన్ని కృష్ణశిలలతో నిర్మిస్తున్నారు. ఇందుకు అవసరమైన కృష్ణశిలలను పల్నాడు జిల్లా కోటప్పకొండ ప్రాంతం నుంచి లోవ దేవస్థానానికి తరలిస్తున్నారు. కట్టడం పనులు ఈ నెలాఖరుకు ప్రారంభించి, మూడు నెలల్లో పూర్తి చేసేందుకు కాంట్రాక్టర్ తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. రూ.1.82 కోట్లతో అమ్మవారికి నూతన ఆలయం, రూ.కోటితో మహామండపం నిర్మించనున్నారు. నూతన ఆలయ నిర్మాణంలో ఐదారు వందల మెట్రిక్ టన్నుల కృష్ణశిలలను వినియోగించనున్నారు. ఈ శిలలను మనుషులతో కొండ పైకి తరలించడం కష్టమవడంతో పనులు ఆలస్యమవుతున్నాయి. దీంతో 150 అడుగుల ఎత్తు వరకూ రాళ్లను తరలించేందుకు భారీ క్రేన్‌ను రప్పించారు. ఈ క్రేన్‌ను నిర్దిష్ట ప్రదేశంలో ఏర్పాటు చేసి, నూతన ఆలయానికి అనువుగా కృష్ణశిలలను నేరుగా అమర్చనున్నారు. సమాంతరంగా మహామండప నిర్మాణ పనులు కూడా శరవేగంగా జరుతున్నాయి. ఇప్పటికే దీని నిర్మాణానికి పిల్లర్ల పనులు జరుగుతున్నాయి. నూతన ఆలయ నిర్మాణానికి అనువుగా స్వయంభువుగా వెలసిన తలుపులమ్మ అమ్మవారిని కదల్చకుండనే.. పూర్వం నిర్మించిన ఆలయాన్ని పూర్తిగా తొలగించారు. దర్శనాలు నిలిపివేసినప్పటికీ అమ్మవారికి ధూపదీప నైవేద్యాలు, నిత్య పూజలు కొనసాగిస్తున్నారు. గత జనవరి నెలాఖరులో అమ్మవారికి బాలాలయం నిర్మించారు. అప్పటి నుంచీ ఇక్కడే భక్తులకు దర్శనాలు కల్పిస్తున్నారు. తలుపులమ్మ అమ్మవారిని ఏటా పది లక్షల మంది భక్తులు దర్శించుకుంటున్నారన్నది అధికారుల అంచనా. హుండీలు, వ్యాపార లైసెన్సులు, ఇతర రుసుముల ద్వారా రూ.6 కోట్ల ఆదాయం సమకూరుతుంది.



లోవలో కొలువైన తలుపులమ్మ అమ్మవారు

మే నెలాఖరులోగా..



ఆలయ పునర్నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేస్తాం. మే నెలాఖరులోగా ఆలయాన్ని ప్రారంభిస్తాం. నూతన ఆలయంలోనే అమ్మవారి ఆషాఢ మాసోత్సవాలు జరుపుతాం. దేవస్థానానికి వచ్చే భక్తులందరికీ దర్శనాలు కల్పిస్తాం. అమ్మవారి పవిత్రతను కాపాడుతూనే ఆలయ పునర్నిర్మాణం, మహామండప నిర్మాణ పనులను స్థపతుల సూచనలు, సలహాలతో అధికారుల పర్యవేక్షణలో నిర్వహిస్తున్నాం. నూతనాలయానికి వృద్ధులు, చిన్నారులు వెళ్లడానికి వీలుగా లిఫ్ట్ లేదా ఎస్కలేటర్ ఏర్పాటు చేస్తాం. ఆలయ అభివృద్ధి పనులు, ప్రారంభోత్సవంపై దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా ఏప్రిల్ నెలాఖరులో అధికారులతో సమీక్షించనున్నారు.

– పెన్మెత్స విశ్వనాథరాజు, కార్యనిర్వహణాధికారి, లోవ దేవస్థానం

గృహ నిర్మాణాల్లో నాణ్యత భేష్

- హౌసింగ్ ఎస్ఈ రామచంద్రన్
- కొమరగిరి లే అవుట్ సందర్శన



గృహ నిర్మాణంలో నాణ్యతను పరిశీలిస్తున్న ఎస్ఈ రామచంద్రన్, అధికారులు

కాకినాడ: నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు పథకంలో గృహ నిర్మాణాలు పూర్తి నాణ్యతా ప్రమాణాలతో జరుగుతున్నాయని ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ శాఖ (విజయవాడ) ఎస్ఈ కె.రామచంద్రన్ అన్నారు. కొమరగిరి లే అవుట్‌లో సుమారు 16 వేల మంది లబ్ధిదారులకు కేటాయించిన ఇళ్ల స్థలాలను, ఇళ్ల నిర్మాణాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలను, ఇళ్ల నిర్మాణంలో వినియోగిస్తున్న ఫాల్‌జీ బ్రిక్స్, కాంక్రీట్ క్యూబ్‌లను తనిఖీ చేశారు. ఇతర సామగ్రితో పాటు లే అవుట్‌లో ఏర్పాటు చేసిన క్వాలిటీ కంట్రోల్ ల్యాబ్‌ను కూడా పరిశీలించారు. అక్కడి గృహనిర్మాణ ప్రగతి, నాణ్యత ప్రమాణాలపై పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రామచంద్రన్ మాట్లాడుతూ, ఇదే స్ఫూర్తితో గృహ నిర్మాణాలను మరింత వేగవంతంగా, పూర్తి నాణ్యతా ప్రమాణాలతో చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని హౌసింగ్, ఆయా శాఖల అధికారులను కోరారు. అక్కడ కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను కూడా ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ సురేష్, జిల్లా మేనేజర్ సుధాకర్ పట్నాయక్, ఈఈలు ఒ.భాస్కరరావు, కేవీఆర్ గుప్తా, డీఈఈ కె.సత్యనారాయణరెడ్డి, ఏఈలు పాల్గొన్నారు.

రత్నగిరి.. భక్తఝురి

- సత్యదేవుని దర్శించిన 40 వేల మంది భక్తులు
- ఆలయ ప్రాంగణంలో నవదంపతుల సందడి
- దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం

అన్నవరం: రత్నగిరి శుక్రవారం భక్తులతో కిటకిటలాడింది. సత్యదేవుని సన్నిధిలో గురువారం రాత్రి, శుక్రవారం తెల్లవారుజామున వందకు పైగా వివాహాలు జరిగాయి. వీరికి తోడు రాష్ట్రంలోని పలుచోట్ల వివాహాలు చేసుకున్న వారు కూడా ఆలయానికి తరలివచ్చారు. వీరందరూ వ్రతాలాచరించి స్వామివారిని దర్శించుకున్నారు. వీరితో పాటు బంధుమిత్రులు కూడా పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం, క్యూలు, వ్రత, విశ్రాంత మండపాలు నవ దంపతులు, వారి బంధుమిత్రులతో నిండిపోయాయి. దేవస్థానం ఘాట్ రోడ్లు, పార్కింగ్ స్థలాలు పెళ్లిబృందాల కార్లతో నిండిపోయాయి. సుమారు 40 వేల మంది స్వామివారిని దర్శించినట్టు ఆలయ అధికారులు తెలిపారు. వ్రతాలు 3 వేలు జరిగాయి. వ్రతాలాచరించిన వారిలో వెయ్యి మందికి పైగా నవదంపతులు ఉండడం విశేషం. స్వామివారి ఉచిత దర్శనానికి రెండు గంటలు, ప్రత్యేక దర్శనానికి గంట సమయం పట్టింది. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో ప్రదక్షిణ చేశారు. రావి చెట్టు వద్ద జ్యోతులు వెలిగించి, పూజలు చేశారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం వచ్చింది. సత్యదేవుని నిత్యాన్నదాన పథకంలో 5 వేల మందికి భోజనం పెట్టారు.

దానాలు, కానుకల డిమాండ్‌కు దూరం

సత్యదేవుని వ్రతాలు ఆచరించిన భక్తులకు దానాలు, కానుకలు ఇవ్వాలని గతంలో వ్రత పురోహితులు డిమాండ్ చేసేవారు. ఈ పరిస్థితిలో రెండు రోజులుగా మార్పు వచ్చింది. భక్తులు ఇచ్చిందే వారు పుచ్చుకుంటున్నారు. కానుకలు, దానాలు ఇవ్వాలని అడగడం లేదు. రత్నగిరిపై పురోహితులు, అర్చకులు, కేశఖండన శాలలో పని చేసే నాయీ బ్రాహ్మణులు భక్తులు సంతోషంగా ఇచ్చింది తీసుకోవాలే తప్ప డిమాండ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని ఇటీవల ఇన్‌చార్జి ఈఓ చంద్రశేఖర్ అజాద్ ఆదేశించారు. దీంతో వారిలో మార్పు వచ్చింది. భక్తుల ఏర్పాట్లను సూపరింటెండెంట్ బలువు సత్యశ్రీనివాస్ పర్యవేక్షించారు. వ్రతాలాచరించే భక్తులతో గతంలో ఆవాహన, విఘ్నేశ్వర పూజలను ఒక బ్యాచ్ మొత్తానికి ఒకే పురోహితుడు చేయించేవారు. శుక్రవారం మాత్రం వీటిని పురోహితులు విడివిడిగా చేయించారు.



వ్రతాలాచరిస్తున్న నవదంపతులతో విడివిడిగా ఆవాహన, విఘ్నేశ్వర పూజ చేయిస్తున్న పురోహితులు

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై దృష్టి

- అధికారులకు కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశం
- వివిధ అంశాలపై సీఎస్ సమీక్ష

కాకినాడ సిటీ: సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనపై అధికారులు దృష్టి సారించాలని కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి అమరావతి నుంచి వివిధ అంశాలపై శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, అసిస్టెంట్ కలెక్టర్ ప్రఖర్ జైన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఎస్సీడీ సర్వేలో భాగంగా ఆధార్ అనుసంధానం చేయడంతో పాటు; బీపీ, డయాబెటిస్ వ్యాధిగ్రస్తులను గుర్తించి, సక్రమంగా వైద్య సేవలు అందించేలా చూడాలని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. రక్తహీనతపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని, హైరిస్క్ గర్భిణులను వారం రోజులు ముందుగానే ఆసుపత్రులకు తరలించి సుఖ ప్రసవం జరిగేలా చూడాలని సూచించారు. బాలింతలను తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ద్వారా తరలించాలన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన మొదటి విడత కార్యక్రమాన్ని ఈ నెల 14న విజయవంతంగా నిర్వహించాలని చెప్పారు. గ్రామ, వార్డు స్థాయిల్లో బడి బయట, డ్రాపౌట్‌గా ఉన్న పిల్లలను గుర్తించి, గురుకుల పాఠశాలల్లో చేర్పించి, వచ్చే విద్యా సంవత్సరంలో పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ల నిర్మాణ పనుల్లో పురోగతి కనిపించాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌ఓ కె.శ్రీధర్‌రెడ్డి, సీపీఓ త్రినాథ్, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఆర్.రమేష్, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పీబీ విష్ణువర్ధిని, డీఈఓ కేఎస్ఎస్ అన్నపూర్ణ, కాకినాడ, పెద్దాపురం డీఎల్‌డీఓలు పి.నారాయణమూర్తి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దే లైఫ్ సర్టిఫికెట్



విశ్రాంత ఉద్యోగి నుంచి బయోమెట్రిక్ తీసుకుంటున్న పోస్ట్‌మన్

- పెన్షన్‌దారులకు తపాలా సేవలు
- వృద్ధులకు, అనారోగ్య బాధితులకు ఉపశమనం
- ఇప్పటికే జిల్లాలో 1,685 మందికి లబ్ధి

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త. లైఫ్ సర్టిఫికెట్ ఇంటివద్దనే ఆన్‌లైన్‌లో నమోదు చేసే సదుపాయం అందుబాటులోకి వచ్చింది. ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ (ఐపీపీబీ) ద్వారా ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ ఫించన్‌దారులకు ఈ సేవలు అందుతున్నాయి. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లకు కూడా దీనిని వర్తింపజేశారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను ప్రభుత్వం విడుదల చేసింది. కొత్త ఏడాది వస్తోందంటే పెన్షనర్లకు లైఫ్ సర్టిఫికెట్ బెంగ పట్టుకుంటుంది. ఈ సర్టిఫికెట్‌ను ప్రభుత్వానికి సమర్పించిన తరువాతే వీరికి పెన్షన్ మంజూరవుతుంది. జీవన్ ప్రమాణ్ పోర్టల్‌లో ఆన్‌లైన్ విధానాన్ని అమలు చేస్తున్నా అనారోగ్యంతో ఉన్నవారు, మంచానికే పరిమితమైన వారు, కదలలేని స్థితిలో ఉన్న వృద్ధులకు అవస్థలు తప్పడం లేదు. ఈ సమస్యల నుంచి వీరికి విముక్తి లభించేలా చర్యలు ప్రారంభమయ్యాయి. పోస్ట్‌మన్ ఇంటికి వచ్చి, వీరి జీవన ధ్రువపత్రాన్ని ఆన్‌లైన్‌లో అక్కడికక్కడే నమోదు చేయనున్నారు. ఈ మేరకు మానవ వనరుల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఫించన్‌దారులు రాష్ట్రంలో ఏ మూలన ఉన్నా ఈ సేవలతో ఉపశమనం పొందవచ్చు. లైఫ్ సర్టిఫికెట్ సమర్పించేందుకు ఈ నెల 20వ తేదీ వరకు గడువు ఉండగా, ఇప్పటికే తపాలా శాఖ ద్వారా 1,685 మంది సేవలు పొందారు. కాకినాడ జిల్లాలో 2 హెడ్ పోస్టాఫీసులు, 54 సబ్ పోస్టాఫీసులు, 284 బ్రాంచి పోస్టాఫీసులు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ పింఛన్‌దారులు 725 మంది ఉండగా, రాష్ట్ర పింఛన్‌దారులు 25 వేల మంది వరకూ ఉన్నారు.

ఇంటివద్దే సేవలు



లైఫ్ సర్టిఫికెట్ సమర్పించేందుకు ప్రభుత్వం కొత్తగా తీసుకున్న నిర్ణయంతో పెన్షనర్లకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. ప్రత్యేక యాప్‌తో ఈ సేవలు అందుబాటులోకి వచ్చాయి. పెన్షనర్లు ఇంటి వద్దనే ఉండి ఈ యాప్‌ను తమ స్మార్ట్ ఫోన్లో డౌన్‌లోడ్ చేసుకుంటే చాలు. దీని ద్వారా బుక్ చేసిన పోస్ట్‌మన్ ఇంటికి వచ్చి బయోమెట్రిక్ చేయించడం ద్వారా అక్కడికక్కడే లైఫ్ సర్టిఫికెట్ ఆన్‌లైన్ చేస్తారు. ఇందుకు రుసుంగా రూ.70 చెల్లిస్తే సరిపోతుంది.

– దాసరి నాగేశ్వరరెడ్డి, పోస్టల్ సూపరింటెండెంట్, కాకినాడ

గోదావరి డెల్టాకు నీటి విడుదల

సీలేరు (అల్లూరి సీతారామరాజు): గోదావరి డెల్టా భూములకు సీలేరు విద్యుత్ కాంప్లెక్స్‌లోని డొంకరాయి జలాశయం నుంచి రోజుకు 2,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు ఎస్ఈ ప్రశాంత్‌కుమార్ తెలిపారు. జలవనరుల శాఖ అధికారుల ఆదేశాలతో గత ఏడాది డిసెంబర్ చివరి వారం నుంచి డెల్టా అవసరం మేరకు ఎప్పటికప్పుడు నీటిని విడుదల చేస్తున్నామని చెప్పారు. డెల్టా భూములకు మరింత నీరు కావాల్సి ఉన్నందున శుక్రవారం నీటి విడుదల ఆరంభించామని, వారం రోజుల వరకూ ఇది కొనసాగుతుందని తెలిపారు. సీలేరు కాంప్లెక్స్ నుంచి ఇప్పటి వరకూ ఆరు టీఎంసీల జలాలు విడుదల చేశామని పేర్కొన్నారు. ఇది కాకుండా పొల్లూరు విద్యుత్ కేంద్రంలో రోజు వారీ ఉత్పత్తి అనంతరం మరో 4,300 క్యూసెక్కులు కూడా గోదావరిలో చేరుతుందని తెలిపారు. సీలేరు, డొంకరాయి, పొల్లూరు విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి ఆశాజనకంగా ఉందని ఎస్ఈ తెలిపారు.

పక్షులకు ఆవాసంగా..



కోరమాండల్ గ్రీన్ బెల్ట్‌లో పక్షుల సందడి

- కోరమాండల్ గ్రీన్ బెల్ట్‌లో 104 పక్షి జాతుల గుర్తింపు
- ఇప్పటికి 4 వేల విహంగాల నమోదు

కాకినాడ రూరల్: వలసపాకల, వాకలపూడి గ్రామాల పరిధిలోని తమ పరిశ్రమ ప్రాంగణం పక్షుల ఆవాస కేంద్రంగా కూడా రూపుదిద్దుకుంటోందని కోరమాండల్ ఎరువుల కర్మాగారం ప్రతినిధులు తెలిపారు. 686 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ పరిశ్రమలో 100 ఎకరాల్లో నీటి వనరులు, 383 ఎకరాల్లో గ్రీన్ బెల్ట్ ఏర్పాటు చేసి, 2011లో పక్షుల పునరావాస కేంద్రం ఆరంభించారు. ఆసియన్ ఓపెన్ బిల్, గ్రే హెరాన్లు, పెయింటెడ్ కొంగలు, డార్టర్ వంటి పక్షులకు ఈ ప్రాంతం అతి పెద్ద సంతానోత్పత్తి కేంద్రంగా మారిందని పరిశ్రమ ప్రతినిధులు తెలిపారు. అడవి నీటి పక్షులకు ఇది విశ్రాంతి ప్రదేశంగా కూడా నిలుస్తోందన్నారు. ఇప్పటి వరకూ 104 జాతుల పక్షులను కోరమాండల్ ప్రాంతంలో గుర్తించారు. వీటిలో 13 సంతానోత్పత్తి జాతులుగా, 24 విదేశాల నుంచి వచ్చే వలస పక్షులుగా గుర్తించారు. సుమారు 4 వేల పక్షులను ఇప్పటికే నమోదు చేశారు. ఈ ప్రాంతాన్ని యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం అధికారులు సందర్శించి, పక్షుల పునరావాసం, సంతానోత్పత్తిపై సాంకేతిక సహకారం అందిస్తున్నారని సంస్థ ప్రతినిధులు తెలిపారు.

చైల్డ్ సైకాలజీలో పీజీ డిప్లొమా

రాజానగరం: చైల్డ్ అండ్ అడోలసెంట్ గైడెన్స్ అండ్ కౌన్సెలింగ్‌లో పీజీ డిప్లొమా కోర్సును ప్రారంభించనున్నామని ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఇన్‌చార్జి ఉప కులపతి ఆచార్య జీవీఆర్ ప్రసాదరాజు తెలిపారు. సంబంధిత బ్రోచర్‌ను శుక్రవారం ఆయన విడుదల చేశారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైకాలజీ ఆధ్వర్యాన ఏడాది కాలపరిమితితో కూడిన ఈ కోర్సులో ప్రవేశానికి ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు అర్హులని తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న వారు ఈ నెల 17 లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 7093 00 8477 నంబరులో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, కోర్సు కో ఆర్డినేటర్ నక్కిన నారాయణ, పడాల రాజశేఖర్, సీహెచ్ భవాని పాల్గొన్నారు.



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న ఆచార్య ప్రసాదరాజు తదితరులు

క్లుప్తంగా

ప్రగతికి జాతీయస్థాయిలో 2వ ర్యాంక్

- ఎడ్యుస్కిల్స్ వర్చువల్ ఇంటర్న్‌షిప్‌లో ఘనత
- కళాశాల చైర్మన్ కృష్ణారావు



ఎడ్యుస్కిల్ వర్చువల్ ఇంటర్న్‌షిప్



డాక్టర్ పి.కృష్ణారావు, ప్రగతి ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఇ) వర్చువల్ ఇంటర్న్‌షిప్‌లో ప్రగతి ఇంజినీరింగ్ కళాశాల జాతీయ స్థాయిలో రెండో ర్యాంక్ సాధించింది. ఈ మేరకు కళాశాల చైర్మన్ పి.కృష్ణారావు శుక్రవారం తెలిపారు. దేశవ్యాప్తంగా 14 రాష్ట్రాల నుంచి 155 ఉన్నత విద్యాసంస్థల నుంచి 59,500 మందికి పైగా విద్యార్థులు పాల్గొనగా ప్రగతి విద్యార్థులు 2,150 మంది పాల్గొన్నారన్నారు. నాలుగు విశిష్ట విభాగాల్లో ఇంటర్న్‌షిప్ పూర్తిచేయడం ద్వారా ఈ ఘనత సాధించామని తెలిపారు. ఏడబ్ల్యూఎస్ (అమెజాన్ వెబ్ సర్వీస్) అకాడమీ విభాగంలో 575, డేటా ఎనలిటిక్స్ ప్రాసెస్ ఆటోమేషన్ ఇంటర్న్‌షిప్ అండర్ అట్రిక్స్ 261, మైనింగ్ ప్రాసెస్ అండర్ సెలొనిస్ 71, సైబర్ సెక్యూరిటీ అండర్ లో ఆల్టో 455, రోబొటిక్స్ ప్రాసెస్ ఆటోమేషన్ అండ్ బ్లూ ప్రిజమ్ 369, నెట్‌వర్కింగ్, నెట్‌వర్క్ క్లౌడ్‌లలో 419 మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. విద్యార్థులను కళాశాల మేనేజ్‌మెంట్ డైరెక్టర్ ఎంవీ హరినాథబాబు, డైరెక్టర్ శంభుప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ ఎం.సతీష్ అభినందించారు.

విద్యుత్ షాక్‌తో భవన నిర్మాణ కార్మికుడి మృతి



రాంబాబు మృతదేహం

ప్రత్తిపాడు రూరల్: విద్యుత్ షాక్‌తో శుక్రవారం భవన నిర్మాణ కార్మికుడు మృతిచెందాడు. మండలంలోని వాకపల్లి గ్రామానికి చెందిన కురందాసు రాంబాబు (30), గింజాల వీరనారాయణ భవన నిర్మాణ పనుల నిమిత్తం పోతులూరు వచ్చారు. ఇంటి నిర్మాణ పనులు చేస్తుండగా ఒక్కసారిగా 11 కేవీ విద్యుత్ వైర్లు తగిలివారు షాక్‌కు గురయ్యారు. వారిలో రాంబాబు అక్కడికక్కడే మృతి చెందగా గింజాల వీరనారాయణ తీవ్రంగా గాయపడ్డాడు. అతనిని కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

పదోగతి ఎలా ఉందంటే..

- నేడు టెన్త్ విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రత్యేక సమావేశం
- పర్యవేక్షించనున్న జిల్లా విద్యాశాఖ అధికారులు

రాయవరం: వచ్చే నెల మూడో తేదీ నుంచి పదవ తరగతి పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో విద్యార్థుల తల్లిదండ్రులతో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నారు. ఏపీ సమగ్ర శిక్షా అధికారులు ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశాల్లో విద్యార్థుల ప్రగతిని వివరిస్తారు. ఇప్పటికే పాఠశాల పేరెంట్స్ కమిటీ ప్రతి నెలా సమావేశాలు నిర్వహిస్తోంది. ఆత్మ విశ్వాసంతో విద్యార్థులను సన్నద్ధం చేసేందుకు తల్లిదండ్రులకు ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయడంలో తల్లిదండ్రుల పాత్ర, వారి బాధ్యతలు, కుటుంబ సభ్యుల సహకారాన్ని వివరించనున్నారు. సమావేశాలకు అధిక సంఖ్యలో విద్యార్థుల తల్లిదండ్రులు హాజరయ్యేలా హెచ్‌ఎం/ప్రిన్సిపాల్స్ చర్యలు తీసుకోవాలి. ఉత్తమ ఫలితాలను రాబట్టేందుకు ఈ సమావేశాలు దోహద పడాలన్నది ఏపీ సమగ్ర శిక్షా లక్ష్యం. పేరెంట్స్ కమిటీ సమావేశాలు ఏర్పాటు చేసి, ఈ నెల 15వ తేదీలోగా ఉన్నతాధికారులకు నివేదికలు పంపించాల్సి ఉంది.

హెచ్‌ఎం/ఉపాధ్యాయులకు సూచనలు

- ఇప్పటి వరకు విద్యార్థులు రాసిన పరీక్షల ఫలితాలు, విద్యార్థి స్థాయిని తల్లిదండ్రులకు వివరించాలి.
- వివిధ సబ్జెక్టుల్లో అధిక మార్కులు సాధించే అంశాలు, సోషల్‌లో మ్యాప్ పాయింటింగ్, సైన్స్‌లో చిత్రపటాలు, ప్రయోగాలు, లాంగ్వేజెస్‌లో లెటర్ రైటింగ్, గ్రామర్ టిప్స్ తదితర అంశాలపై ఫోకస్ చేయాలి.
- విద్యార్థులు స్టడీ అవర్స్‌కు హాజరయ్యేలా చూడడం, మోడల్ ప్రశ్న పత్రాలను ప్రాక్టీస్ చేసేలా చూడడం.
- పరీక్షల భయం పోగొట్టేందుకు కష్టమైన టాపిక్స్‌లో విద్యార్థులను సంసిద్ధులను చేయాలి.
- విద్యార్థుల ప్రగతిని పరిశీలన చేయాలే తప్ప, వారిపై ఒత్తిడి తీసుకురాకూడదు. అవసరమైన సహకారం అందించాలి.
- పరీక్షలు ముగిసే వరకు సంబంధిత ఉపాధ్యాయులు విద్యార్థులు, తల్లిదండ్రులను పరిశీలన చేస్తుండాలి.
- విద్యార్థులకు వారి స్థాయిలకు అనుగుణంగా ఉపాధ్యాయులు మార్గదర్శకం చేస్తుండాలి.
- ఆరు పేపర్ల విధానంపై అవగాహన కల్పించాలి.
- ఆరోగ్యంగా ఉండేందుకు తీసుకోవాల్సిన ఆహారంపై అవగాహన కల్పించాలి.
- రోజూ 6–7 గంటల పాటు నిద్ర అవసరమని చెప్పాలి. టీవీ, మొబైల్ ఫోన్స్, సోషల్ మీడియాకు దూరంగా ఉండేలా విద్యార్థులను మోటివేట్ చేయాలి.



జిల్లాలో పరిస్థితి

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 531 ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యంలో ఉన్నత పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలల్లో 69,290 మంది రెగ్యులర్ విద్యార్థులు పది పరీక్షలకు హాజరవుతున్నారు.

పది రెగ్యులర్ విద్యార్థులు ఇలా..

జిల్లా	బాలురు	బాలికలు	మొత్తం
తూర్పుగోదావరి	11,230	11,509	22,739
కాకినాడ	13,647	13,820	7,467
కోనసీమ	9,806	9,278	19,084

సమావేశాలు తప్పనిసరి



పది పరీక్షలు సమీపిస్తున్నందున ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్య పాఠశాలల్లో తప్పనిసరిగా పేరెంట్స్ కమిటీ సమావేశాలు నిర్వహించి, నివేదికలను ఉన్నతాధికారులకు పంపించాలి. విద్యార్థుల విద్యా స్థాయిపై తల్లిదండ్రులతో చర్చించాలి. పరీక్షలకు 23 రోజులు మాత్రమే గడువు ఉంది. ఉపాధ్యాయులతో పాటుగా, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.

– జి.నాగమణి, ఆర్‌జేడీ, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ

తండ్రీకొడుకుల దుర్మరణం

- మోపెడ్‌ను ఢీకొన్న అపెక్స్ ఫ్యాక్టరీ బస్సు
- ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై కుటుంబ సభ్యులు, బంధువుల నిరసన
- రెండు గంటల పాటు స్తంభించిన ట్రాఫిక్
- ఫ్యాక్టరీ యాజమాన్యం హామీతో ఆందోళన విరమణ



మంగబ్బాయి (పాత చిత్రం)



సత్తిబాబు (పాత చిత్రం)



బంధువుల బైఠాయింపుతో ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై స్తంభించిన ట్రాఫిక్



ఘటనా స్థలిలో తీవ్రంగా గాయపడ్డ మంగబ్బాయి, సత్తిబాబు



రోదిస్తున్న సత్తిబాబు కుమార్తె వెంకటలక్ష్మి, బంధువులు

సామర్లకోట: స్థానిక ఫ్లై ఓవర్ బ్రిడ్జి కూడలిలో శుక్రవారం మధ్యాహ్నం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తండ్రీ కొడుకులు మృతిచెందారు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం పుప్పాల మంగబ్బాయి (62) స్థానిక సత్యనారాయణపురంలోని ఎఫ్‌సీఐలో ఎగుమతి, దిగుమతి పర్మినెంట్ కూలీగా పనిచేసి ఇటీవల పదవీ విరమణ చేశాడు. అతని పెద్ద కుమారుడు సత్తిబాబు (41) పెద్దాపురంలోని ఒక ప్రైవేటు ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. ఇద్దరూ కలసి మోపెడ్‌పై సత్యనారాయణపురం నుంచి కాకినాడ వెళుతున్నారు. కాకినాడ నుంచి వస్తున్న అపెక్స్ రొయ్యల ఫ్యాక్టరీకి చెందిన బస్సు వేగంగా వచ్చి ఢీ కొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న ట్రాఫిక్ ఎస్‌ఐ అడపా గరగారావు కొన ఊపిరితో ఉన్న ఇద్దరిని అంబులెన్సులో స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రికి చేరేటప్పటికి ఇద్దరూ మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు, ఎఫ్‌సీఐ జట్టు కూలీలు ఫ్లై ఓవర్ బ్రిడ్జిపైకి చేరుకున్నారు. దాంతో ఘటనా ప్రదేశంలో ఉద్రిక్తత పరిస్థితి ఏర్పడింది. ఘటనా ప్రదేశంలోనే ఇద్దరూ చనిపోయారని, పోలీసులు మృతదేహాలను ఆస్పత్రికి తరలించారని బాధితులు ఆరోపించారు. మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఫ్లైఓవర్ బ్రిడ్జి కూడలిలో బైఠాయించడంతో ట్రాఫిక్ రెండు గంటల పాటు స్తంభించింది. విషయం తెలుసుకున్న అపెక్స్ ఫ్యాక్టరీ యాజమాన్య ప్రతినిధులు ఘటనా ప్రదేశానికి చేరుకొని మృతుల కుటుంబాలకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. సీఐ కె.దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్సైలు, ఏఎస్సైలు, సిబ్బంది ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

రెక్కాడితేనే గాని డొక్కాడని కుటుంబం..

డెక్కాడితే గాని డొక్కాడని కుటుంబంలో తండ్రీ కొడుకులు మృతి చెందడంతో సత్యనారాయణపురంలో విషాద ఛాయలు అలముకున్నాయి. పుప్పాల సత్తిబాబుకు ముగ్గురు కుమారులు కాగా పెద్ద కుమారుడు సత్తిబాబు తండ్రి వద్దనే ఉంటున్నాడు. మిగిలిన ఇద్దరు వేరు వేరుగా ఉంటున్నారు. సత్తిబాబుకు భార్య సత్యవేణి, 18 సంవత్సరాల కుమార్తె వెంకటలక్ష్మి ఉన్నారు. కుమార్తెకు పెళ్లి కావలసి ఉంది. సత్తిబాబు మృతి చెందడంతో భార్య, కుమార్తెలు భోరున విలపించారు. మండే ఎండలో రోడ్డుపై వారు రోదించిన తీరు స్థానికుల హృదయాలను కలచి వేసింది. యాజమాన్యం బాధిత కుటుంబానికి న్యాయం చేయకపోతే శనివారం మృతదేహాలతో ఫ్యాక్టరీ వద్ద ఆందోళన చేస్తామని ఎఫ్‌సీఐ కార్మిక సంఘ నాయకుడు చల్లా కొండ హెచ్చరించారు.

రూ.ఐదు లక్షల చొప్పున పరిహారం, ఉద్యోగం

మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు స్థానిక పోలీసు స్టేషన్‌లో మృతుని బంధువులతో ఫ్యాక్టరీ ప్రతినిధులు నష్టపరిహారం విషయమై చర్చించారు. మృతుల కుటుంబాలకు రూ.ఐదు లక్షల చొప్పున చెల్లించడంతో పాటు వారి కుటుంబాల్లో ఇద్దరికి ఉద్యోగాలు ఇవ్వడానికి అంగీకరించారు. బస్సుకు వచ్చే ప్రమాద ఇన్సూరెన్సు సొమ్ము బాధిత కుటుంబానికి ఇచ్చేలా ఒప్పుకున్నారు. చర్చలలో సీఐ కె.దుర్గాప్రసాద్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మద్దాల శ్రీను, కౌన్సిలర్లు, పాల్గొన్నారు. ఈ మేరకు సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏటికొప్పాక ఖ్యాతి చెక్కు చెదరదు

పద్మశ్రీ అవార్డుకు ఎంపికైన సీవీ రాజు



సీవీ రాజును సత్కరిస్తున్న అకాడమీ అధికారులు

రాజానగరం: చైనా నుంచి వెల్లువలా వస్తున్న బొమ్మలు ఎంత పోటీ ఇస్తున్నప్పటికీ ఏటికొప్పాక బొమ్మలకు ఉన్న ఖ్యాతి ఏనాటికీ చెక్కు చెదరదని అనకాపల్లి జిల్లా ఏటికొప్పాక వన సంరక్షణ సమితి అధ్యక్షుడు సీవీ రాజు అన్నారు.

2023 సంవత్సర పద్మశ్రీ అవార్డుకు కళారంగం నుంచి ఎంపికైన నేపథ్యంలో దివాన్‌చెరువులోని ఏపీ స్టేట్ ఫారెస్టు అకాడమీ ఆహ్వానించడంతో శుక్రవారం వచ్చారు. శిక్షణలో ఉన్న అటవీ అధికారులు, వన సంరక్షణ సమితుల అధ్యక్షులతో ఏర్పాటు చేసిన ముఖాముఖిలో పాల్గొన్నారు. గత 550 ఏళ్లుగా ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొంటూ బొమ్మల తయారీలో ఏటికొప్పాక ప్రత్యేకతను సంపాదించుకుందన్నారు.

కళానైపుణ్యం, సాంకేతికత, వనరులు ఒకేచోట ఉన్న గ్రామం కావడంతో ఇక్కడ పుట్టిన వారికి 12 ఏళ్ల వయసుకే బొమ్మల తయారీలో ఇంజినీర్ స్థాయి పరిజ్ఞానం అలవడుతుందన్నారు. బొమ్మల నాణ్యత, ఆకర్షణీయమైన తయారీల వల్లనే మన్‌కీ బాత్‌లో ప్రధాని ఏటికొప్పాక కళను శ్లాఘించారన్నారు. కాశీ నుంచి కన్యాకుమారి వరకు ఏటికొప్పాక బొమ్మలు లేని పుణ్యక్షేత్రం లేదనడం అతిశయోక్తి కాదని సీవీరాజు పేర్కొన్నారు.

పర్యావరణ హితంగా బొమ్మల తయారీ

ఏటికొప్పాక బొమ్మలకు ఇంతటి పేరు రావడానికి ప్రధాన కారణం అవి పర్యావరణ హితంగా ఉండటమేనని అకాడమీ డైరెక్టర్ పీఏవీ ఉదయ్‌భాస్కర్ అన్నారు. అంకుడు చెట్లను అశాస్త్రీయంగా నరికివేయడం వలన కొన్నేళ్ల కిందట ముడిసరుకు లభ్యతలో తలెత్తిన సమస్యల పరిష్కారంలోను, బొమ్మలకు పూర్తి సహజరంగులు వాడేట్లు చేయడంలోను సీవీ రాజు కృషి స్ఫూర్తిదాయకమని అన్నారు. అనంతరం సీవీరాజును అకాడమీ తరపున సత్కరించారు. సీసీఎఫ్ శ్రీశరవణన్, రంపచోడవరం డీఎఫ్ఓ నరేంద్ర, అకాడమీ ఏసీఎఫ్‌లు డాక్టర్ ఎన్‌వీ శివరామప్రసాద్, ఏవీ రమణమూర్తి, టి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

అన్నదమ్ములే నిందితులు

- హత్య కేసును ఛేదించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ బాలచంద్రారెడ్డి



వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ బాలచంద్రారెడ్డి, సీఐ శివగణేష్, ఎస్సై సురేష్

రాయవరం: గత నెల 24న రాయవరం మండలం మాచవరం గ్రామ సమీపంలో మండపేట–కాకినాడ ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న పంట పొలాల్లో జరిగిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. హత్యకు దారి తీసిన పరిణామాలను, హత్యాచార వివరాలను రామచంద్రపురం డీఎస్పీ డి.బాలచంద్రారెడ్డి శుక్రవారం రాయవరం పోలీస్‌స్టేషన్‌లో విలేకరులకు వివరించారు. హతురాలు సత్యవేణి, నిందితులు నల్లమిల్లి ఉమామహేశ్వరరెడ్డి, వెంకట సత్యనారాయణరెడ్డి దేవుడు కాలనీలో నివసిస్తున్నారు. గతంలో నిందితులు సత్యవేణితో అసభ్యంగా ప్రవర్తించడంతో ఆమె పెద్దలకు తెలియజేసింది. దీన్ని మనసులో ఉంచుకున్న నిందితులు సత్యవేణి హత్యకు ప్రణాళిక రచించారు. ఎప్పటి నుంచో వేచి చూస్తున్న వీరికి గత నెల 23 రాత్రి సత్యవేణి మాచవరం వంతెన వద్ద నుంచి రాత్రి 8 గంటల ప్రాంతంలో నడుచుకుంటూ వస్తోంది. విషయాన్ని గమనించిన నిందితులు చినతలుపులమ్మ లోవకు వెళ్లే సమీపంలో ఒంటరిగా వస్తున్న సత్యవేణిని పంట దిమ్మపైకి లాక్కుని వెళ్లి నిందితులు ఇద్దరూ అత్యాచారం చేశారు. ఆపై అక్కడే లభించిన వైరును మెడకు బిగించి హత్యకు పాల్పడ్డారు. ఆమె శరీరంపై ఉన్న బంగారు వస్తువులను తీసుకుని, ఆమెను గడ్డివామిలో పెట్టి దగ్ధం చేశారు. ఇదిలా ఉంటే హత్య కేసులో తన కుమారులు ఉన్నారన్న తెలిసిన నిందితుల తల్లి పద్మ ఈ నెల 8న ఇంట్లో ఉరి వేసుకుని మృతి చెందిన విషయం విదితమే. నిందితులను శుక్రవారం పసలపూడి సమీపంలో పుంత రోడ్డులో పోలీసులు అదుపులోకి తీసుకుని, అనపర్తి జేఎఫ్‌సీఎం ముందు హాజరు పర్చారు.

తొలుత మిస్టరీగా మారిన కేసు

గత నెల 24న గుర్తుపట్టలేని విధంగా కాలిపోయిన మృతదేహం మహిళదా..పురుషునిదా అన్న సందేహం పోలీసులకు ఏర్పడింది. కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకుని దర్యాప్తు చేపట్టారు.

మహిళ అదృశ్యం కేసుపై దృష్టి సారించి

ఈ పరిస్థితుల్లో హత్య జరిగిన సమీపంలోని దేవుడు కాలనీకి చెందిన కొవ్వూరి సత్యవేణి అదే రోజు నుంచి అదృశ్యమైన విషయంపై పోలీసులు దృష్టి సారించారు. ఆ దిశగా దర్యాప్తు ప్రారంభించారు. గ్రామంలోని సీసీ కెమెరాల్లో నిక్షిప్తమైన మహిళ కదలికలను గమనించారు.

హత్య కేసుగా మార్పు

పోలీసులు తొలుత 302, 201 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. నిందితులు నేరం అంగీకరించడంతో 302, 376బి, 435, 404, 201 రెడ్ విత్ 34గా సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ బాలచంద్రారెడ్డి తెలిపారు. మండపేట రూరల్ సీఐ శివగణేష్, రాయవరం ఎస్సై పీవీఎస్ఎన్ సురేష్ పాల్గొన్నారు. కేసు దర్యాప్తులో కీలకపాత్ర పోషించిన కానిస్టేబుల్స్ ఏసుకుమార్(అంగర పోలీస్ స్టేషన్), బీవీవీ సత్యనారాయణ, పి.రాజు(రాయవరం పోలీస్‌స్టేషన్), మహిళా పోలీసులు అనిత, నాగేశ్వరి(మాచవరం), కె.నాగమణి(సోమేశ్వరం), ఎస్.ధనలక్ష్మి(చెల్లూరు)లను డీఎస్పీ అభినందించారు.

నదిలో మునిగి వ్యక్తి మృతి

పి.గన్నవరం: మండలంలోని యర్రంశెట్టివారిపాలెం ఇసుక ర్యాంపు సమీపంలో శుక్రవారం గేదెలు మేపుతున్న ఒక వ్యక్తి ప్రమాదవశాత్తూ వశిష్ట నదీపాయలో మునిగి మృతిచెందాడు. ఎస్సై పి.గంగాభవాని తెలిపిన వివరాల ప్రకారం.. పి.గన్నవరం శివారు కోటవారిపేటకు చెందిన వ్యవసాయ కూలీ నేలపూడి చంటిబాబు (30) శుక్రవారం వైపీ పాలెం వద్ద గేదెలను మేపుతున్నాడు. ఈ క్రమంలో నదిలోకి దిగిన చంటిబాబు ప్రమాదవశాత్తూ నీట మునిగిపోయాడు. దీనిని గమనించిన ర్యాంపులోని కూలీలు అతడిని బయటకు తీసి, పి.గన్నవరం సీహెచ్‌సీకి తరలించారు. అప్పటికే అతడు మరణించినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతుని బావ పి.లక్ష్మణరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై గంగాభవాని వివరించారు.

మనోధైర్యం, నైతిక విలువలతో ప్రశాంతత

- జయప్రకాశ్ నారాయణ



జయప్రకాశ్ నారాయణను సన్మానించిన ఆదిత్య కళాశాలల అధినేత శేషారెడ్డి తదితరులు

గండేపల్లి: ఎదుటివారిపట్ల సౌభ్రాతృత్వం, మంచి నైతిక విలువలు కలిగి ఉంటే మనోధైర్యంతోపాటు సమాజంలో శాంతి నెలకొంటుందని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకుడు జయప్రకాశ్ నారాయణ విద్యార్థులకు సూచించారు. మండలంలోని సూరంపాలెం ఆదిత్య క్యాంపస్‌లో శుక్రవారం విద్యార్థులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ప్రస్తుత తరుణంలో యువకులు ఎదుర్కొంటున్న అనేక సవాళ్లను ఏ విధంగా నివారించుకోవాలో సోదాహరణంగా వివరించారు. పెరుగుతున్న టెక్నాలజీకి అనుగుణంగా విద్యార్థులు తమ భవితను తీర్చిదిద్దుకోవడంతో పాటు ఆణిముత్యాల్లాంటి పాత విధానాలపై అవగాహన కలిగి ఉంటే మేలు చేస్తుందన్నారు. చెడు అలవాట్లకు బానిసలు కాకుండా తమ జీవితాన్ని రాజమార్గంగా ఉండేలా విద్యార్థులు మెలగాలని హితబోధ చేశారు. భావితరాలకు బాసటగా నిలిచి వారికి బంగారు బాట వేసే విధంగా ఆలోచించాలన్నారు. దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని తెలియజేశారు. అత్యధిక యువశక్తి ఉన్న మనదేశం అభివృద్ధి చెందకుండా ఉండటానికి కారణం ప్రాంత, భాష, కుల, మత పార్టీల పరంగా వ్యత్యాసాలు ఉండటమేనని అభిప్రాయం వ్యక్తం చేశారు. అనంతరం ఆయనను సత్కరించారు. ఆదిత్య విద్యాసంస్థల అధినేత ఎన్.శేషారెడ్డి, బిజినెస్ స్కూల్ డైరెక్టర్ ఎన్.సుగుణారెడ్డి, ప్రిన్సిపాల్స్ ఎం.శ్రీనివాసరెడ్డి, డోలా సుబ్రహ్మణ్యం, ఆదిరెడ్డి రమేష్, సంజయ్ కుమార్, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మోటారు సైకిళ్లు ఢీకొని యువకుడి మృతి

జగ్గంపేట: మండలంలోని మల్లిసాల శివారులో రెండు మోటారు సైకిళ్లు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో కిర్లంపూడి మండలం గెద్దనాపల్లికి చెందిన సోమనాథ్ ఉమా మహేష్(21) మృతి చెందినట్లు జగ్గంపేట ఎస్సై విద్యాసాగర్ శుక్రవారం తెలిపారు. కిర్లంపూడి మండలం గెద్దనాపల్లికి చెందిన సోమనాథ్ ఉమామహేష్(21), అదే గ్రామానికి చెందిన అతని మిత్రుడు పాఠంశెట్టి గంగాతేజేశ్వరరావు(తేజ)తో కలిసి మల్లిసాల శివారు సింగరమ్మ చింత వద్ద జరుగుతున్న సింగరమ్మ జాతర చూసేందుకు గురువారం రాత్రి బయలుదేరారు. మల్లిసాల శివారులో ఎదురుగా వేగంగా వస్తున్న మరో మోటారు సైకిల్ వీరిని బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ఉమామహేష్ తలకి తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మరో యువకుడు తేజకు కూడా గాయాలు కావడంతో స్థానిక ప్రయివేట్ ఆసుపత్రికి తరలించినట్టు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై విద్యాసాగర్ తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

FLAT FOR SALE

■ RJY కొంతమూరు VVK నగర్‌లో 120 గజాల W/F ఇండివిడ్యువల్ హౌస్, ఆఫీషియల్ కాలనీలో N/F 3 బెడ్ రూమ్ ఫ్లాట్స్ 1800 Sft అమ్మకం. రెడీటు అక్యుపై. ఈస్ట్ వెస్ట్ ఫ్లాట్స్ 1800 Sft మెయిన్‌రోడ్‌కి దగ్గరగా నూతనంగా నిర్మించబడుచున్నవి. ఫోన్: 99891 54984, 99667 59777 [V-1770]

HOUSE FOR SALE

■ కాకినాడ, రాయుడుపాలెం, టీచర్స్ కాలనీ మెయిన్ రోడ్ నందు 192 చ।। గజాల్లో 2 BHK నార్త్ ఫేసింగ్ ఇండివిడ్యువల్ హౌస్ అమ్మబడును.✆ : 94912 22916, 73388 02766, (నో బ్రోకర్స్) [R-1675]

LAND FOR SALE

■ తూ।।గో।।జిల్లా, తాళ్ళపూడి మండలం, తాళ్ళపూడి మెయిన్ రోడ్ ఆనుకుని శ్రీదేవి థియేటర్ వెనుక నివాస మరియు వ్యాపారానికి అనువుగ 1300 చ।।గ।। 300చ।।గ।। 450 & 180 చ।।గ।। అమ్మకమునకు కలదు. సంప్ర: 8309025067 [P-1214901]

PLOT FOR SALE

■ రాజమండ్రి ఎయిర్‌పోర్ట్ దగ్గర లే-అవుట్‌లో 100 గజముల సైట్‌లు అమ్మకం. గజము కేవలం 3200/-లకే ✆ : 95153 82999 [R-5674]

Services

■ We Release your pledged gold బంగారం బ్యాంక్సులో ప్రైవేట్ సంస్థల్లో తనఖాలో ఉన్నవి మాత్రమే విడిపించి కొనబడును. వేలంలో ఉన్న బంగారం విడిపించి తక్కువ గడువుతో, తనఖా ఇవ్వబడును. ✆ : 73966 71666 [R-5721]

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299 [B-2328]

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్. ✆ 76508 91999 [B-786692]

ASTROLOGY

■ కేరళ చౌడేశ్వరి మాంత్రిక జ్యోతిష్యం, ఉచిత భవిష్యం మీ ఎటువంటి సమస్యలకైనా 3 రోజుల్లో శాశ్వత పరిష్కారం స్త్రీ/పురుష వశీకరణ 100% గ్యారంటీ సంప్ర: 6304163239 [W-775844]

Wanted

■ ప్రముఖ ఇన్సూరెన్స్ కంపెనీలో ఎగ్జిక్యూటివ్స్‌గా చేయుటకు డిగ్రీ పాసైన స్త్రీ/పు అభ్యర్థులు జిల్లా అంతటా కావలెను. వయస్సు 25 to 35, జీతము 15000 Contact: ✆ : 90596 89778 [R-5662]

■ విజయవాడలో ప్రముఖ ఫైనాన్స్ కంపెనీలో పనిచేయుటకు రికవరీ మేనేజర్స్ కావలెను. జీతం: 18000+ఫుడ్, ఎకామిడేషన్ కలదు. ✆ : 81870 83218 [R-5677]

■ కనస్ట్రక్షన్స్‌లో మంచి అనుభవం ఉన్న సూపర్‌వైజర్ కావలెను. Cont : శ్రీ గాయత్రి ఏజెన్సీస్, కాకినాడ. ✆ : 94403 52688 [R-224]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. ఆకర్షణీయమైన జీతం + ఇన్సెంటివ్స్ కలవు. ఫ్రీ బుక్‌లెట్ కొరకు సంప్ర : 90595 09586 [L-542]

■ వృద్ధులను,పేషెంట్‌లను వారిఇంటివద్దనే ఉండి వారి అన్ని పనులను చూసుకొనుటకు నర్సులు, RMPలు, కాంపౌండర్లు VJAలో ప్రముఖ హోంకేర్ ఆఫీస్‌కి కావలెను. జీ: 15-20K, వసతి+భో।। ✆ 90100 35559, 82478 73428 [B-935]

■ కాకినాడ Foton Doors కంపెని నందు పని చేయుటకు అనుభవం కలిగిన Marketing Executives (M) కావలెను. టూ వీలర్ తప్పనిసరి. ✆ 88826 59999. [B-428]

■ [illegible] day audit teacher [illegible] Coordinator: 15000 [illegible] [P-2829]

■ పైడా కాలేజీలో పనిచేయుటకు Tele-కాలర్స్, కంప్యూటర్ ఆపరేటర్లు కావలెను. వివరాలకు ఫోన్ : 7382315999, 7382456539 [HA-10273]

■ ఏలూరు, కైకలూరు, పాలకొల్లు, కలిదిండి, మార్టేరు, తాడిపాక లలో ప్రముఖ హాస్పిటల్ నందు పనిచేయుటకు బి.పి.టి/ యం.పి.టి. అర్హత కలిగిన ఫిజియోథెరపిస్ట్ కావలెను. సంప్ర: 7842465180, 7068104104 [P-1216858]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.